

పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి - విలేకరులు

జిల్లాలో పలుచోట్ల విస్తారంగా వర్షం కురిసింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

పోలవరం : మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మండల కేంద్రంలో బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీ, బిసి కాలనీ, మెయిన్ బజార్, కొత్త పట్టిసీమ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజల ఇబ్బందులకు గురయ్యారు. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న పంట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లింగపాలెం: మండలంలో కురిసిన వర్షానికి మామిడికాయలు నేలరాలాయి. కల్లాల్లోని మొక్కజొన్న తడిసి ముద్దయింది. అలాగే పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది.

మహిళా పోలీసులకు జాబ్‌చార్ట్ ఉందా?

నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలు దాటి విధుల కేటాయింపు
పలుచోట్ల మహిళా పోలీసులపై సిఐ, ఎస్ఐల తీరు దారుణం
అర్ధరాత్రి వరకూ బందోబస్తు, ఆదివారం, పండుగ దినాల్లోనూ విధులు
ప్రశ్నిస్తే షోకాజ్ నోటీసుల పేరుతో బెదిరింపులు
ఐదు గంటల వరకూ సచివాలయంలో.. ఆపై బందోబస్తు పనులు
తల్లడిల్లుతున్న మహిళా పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు (మహిళా సంరక్షణ కార్యదర్శులు) అసలు జాబ్‌చార్ట్ ఉందా.. వీరికి విధుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరుగుతుందా.. పోలీస్ ఉద్యోగుల మాదిరిగా అర్ధరాత్రి వరకూ బందోబస్తు విధులు, ఆదివారం, పండుగ దినాల్లో విధులు కేటాయించొచ్చా.. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సచివాలయంలో పని చేసిన మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఐదు గంటల తర్వాత విధులు కేటాయించొచ్చా వంటి పలు ప్రశ్నలకు సమాధానం లేకుండాపోయింది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 900కుపైగా గ్రామ సచివాయాలు ఉన్నాయి. ప్రతి గ్రామ సచివాలయానికి ఒక మహిళా సంరక్షణ అధికారిని ప్రభుత్వం నియమించింది. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లు మాదిరిగానే వీరు కూడా పరీక్షలు రాసి ఈ ఉద్యోగంలో చేరారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు చేయాల్సిన విధుల గురించి ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. గ్రామ సచివాలయ పరిధిలో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ స్టేషన్లకు ఇవ్వడం, మహిళలకు సంబంధించిన కేసులు సచివాలయ పరిధిలో జరిగితే హాజరుకావడం, సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీలను సందర్శించడం, ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామస్తులకు చట్టాల గురించి తెలియజేయడం వంటి విధులున్నాయి. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో వీరు పని చేయాల్సి ఉంటుందని పేర్కొంది. వీరికి సంబంధించి డిడిఒ అధికారం కూడా పంచాయతీ కార్యదర్శికే ఉంది. తర్వాత కాలంలో వీరికి యూనిఫారం ఇచ్చి పోలీస్ సిబ్బందిగా పరిగణించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ప్రభుత్వం ఆ జిఒను వెనక్కి తీసుకుని యూనిఫారం వంటి వాటిని విరమించుకుంది. ఇంకా కోర్టులో ఈ కేసు విచారణలో ఉంది. ఎందుకంటే మహిళా సంరక్షణ అధికారులు పోలీస్ ఉద్యోగానికి సంబంధించిన ఎటువంటి ఫిజికల్ టెస్టులు పాస్ కాలేదు. వీరు సచివాలయ పరిధిలో ఉద్యోగాలు పొందినవారు మాత్రమే. అంతర్ జిల్లాల బదిలీలు లేక భార్యాభర్తలు వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు పెద్దసంఖ్యలో ఉన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా విధులు..?


మహిళా సంరక్షణ కార్యదర్శులు ఉదయం పది గంటలకు సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేయాలి. సాయంత్రం ఐదు గంటలకు డ్యూటీ ముగిసిన తర్వాత వీరిని పోలీస్ స్టేషన్లకు పిలిచి విధులు కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామ సచివాలయ పరిధి దాటి విధులు కేటాయించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ఎందుకంటే వారికిచ్చిన ఉద్యోగమే గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి. అయితే అర్ధరాత్రి వరకూ వేరే ప్రాంతాల్లో బందోబస్తు విధులు కేటాయిస్తున్నారు. కాదంటే షోకాజ్ నోటీసులిచ్చి సిఐలు, ఎస్ఐలు బెదిరిస్తున్నారు. ప్రతిరోజూ మండలంలోని ఇద్దరు మహిళా పోలీసులకు పోలీస్ స్టేషన్‌లో విధులు వేస్తున్నారు. మరోపక్క తమకు చెప్పకుండా ఎలా వెళ్తారంటూ పంచాయతీ కార్యదర్శుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరితే సిఐలు, ఎస్ఐలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం మహిళా పోలీసులకు సచివాలయ పరిధిలో ఐదు సంవత్సరాల్లోపు పిల్లల జాబితా తయారీ, మిషన్ వాత్సల్య విధులు, ఎస్‌డిజి సర్వే వంటివన్నీ అప్పగించారు. అవన్నీ కాకుండా ఎస్ఐలు, సిఐలు అదనపు విధులు కేటాయిస్తున్న పరిస్థితి ఉంది. 50 కిలోమీటర్ల దూరంలో సిఎం పర్యటన బందోబస్తుకు, ఉద్యోగ రాత పరీక్షా కేంద్రాల విధులకు కూడా మహిళా పోలీసులను వినియోగిస్తున్నారు. అర్ధరాత్రి వరకూ డ్యూటీ చేసి ఉదయం సచివాలయానికి ఆలస్యంగా వస్తే పంచాయతీ కార్యదర్శి ఊరుకోవడం లేదు. దీంతో తమ జాబ్‌చార్ట్ ఏమిటంటూ మహిళా పోలీసులు మదనపడుతున్నారు. ప్రశ్నిస్తే సిఐలు, ఎస్ఐలు మరింత దారుణంగా కక్ష సాధింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తమ సమస్యలు జిల్లా ఉన్నతాధికారులకు చెప్పాలన్నా మహిళా పోలీసులు భయపడుతున్నారు. మహిళా పోలీసుల జాబ్‌చార్ట్‌పై ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు స్పష్టత ఇవ్వకపోతే అధికారుల వేధింపులు రోజురోజుకీ మరింత పెరిగే ప్రమాదం ఉంది.

కోవర్టులను పెట్టి కక్షసాధింపు

'విభజించు పాలించు' అనే బ్రిటీష్ వారి సూత్రాన్ని పలుచోట్ల సిఐలు, ఎస్ఐలు మహిళా పోలీసుల విషయంలో అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ మాటవింటూ అనుకూలంగా ఉన్న మహిళా పోలీసులతో మిగిలిన వారి సమాచారాన్ని, వాళ్ల మాట్లాడుకునే మాటలను తెలుసుకుని కక్ష సాధింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. తమకు కోవర్టులుగా పని చేస్తున్న ఉద్యోగులకు విధుల కేటాయింపుల్లో వెసులుబాటు ఇస్తున్నట్లు సమాచారం.

పది పరీక్షా కేంద్రాల వద్ద నో సెల్‌ఫోన్ జోన్

నేటి నుంచి పరీక్షలు ప్రారంభం
అరగంట ముందుగానే పరీక్ష హాలులోకి చేరుకోవాలి
హాల్ టిక్కెట్ చూపితే ఆర్‌టిసిలో ప్రయాణం ఉచితం
ఆరు సున్నిత కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి.రవిసాగర్



ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈనెల మూడో తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని, అలాగే సంచలన ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి.రవిసాగర్ తెలిపారు. ఇందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేశామని చెప్పారు. నో ఫోన్ జోన్‌గా పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో పలు ప్రశ్నలకు డిఇఒ సమాధానం చెప్పారు.



ప్రశ్న : ఎన్ని కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు?

పదో తరగతి పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా ఎ, బి, సి కేటగిరిలో కేంద్రాలను ఏర్పాటు చేశాం 'ఎ' కేటగిరిలో 29 కేంద్రాలు, 'బి' కేటగిరిలో 54, 'సి' కేటగిరిలో 37 కేంద్రాలు మొత్తంగా 120 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం

ప్రశ్న : ఈ ఏడాది ఎంతమంది పరీక్షలు రాస్తున్నారు?

[illegible] విద్యార్థులు 22,809 రాస్తున్నారు. వీరిలో బాలురు 11,356మంది, బాలికలు 11,453 మంది ఉన్నారు. పదో తరగతి సప్లిమెంటరీ రాసే బాలురు 2162 మంది, బాలికలు 1246 మంది మొత్తంగా 3408 మందిగా నమోదయ్యారు. రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులు కలిపి 26,217 మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 13,518, బాలికలు 12,699 మంది ఉన్నారు.

ప్రశ్న : పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు ఏమి తీసుకున్నారు?

పరీక్ష కేంద్రాల వద్ద నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించాము. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇన్విజిలేటర్లు గానీ, డిఒలుగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ పరీఓఆ కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ఉత్తర్వులు జారీచేశాం. వారివారి సెల్‌ఫోన్లు పరీక్షా కేంద్రాల గేట్ బయట మాత్రమే వదిలి లోపలికి వెళ్లే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాము. 120 పరీక్షా కేంద్రాల వద్ద ఒక్కొక్క కేంద్రంలో ఒక ఎఎన్ఎం, ఒక ఆశా వర్కర్ అత్యవసర పరిస్థితుల కోసం వినియోగిస్తున్నాము ఒఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. అంతేకాకుండా స్థానికంగా ఉండే తహశీల్దార్లు, ఎంపిడిఒలు అకస్మాత్తుగా పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేయాలని సూచనలు చేశాం.

ప్రశ్న : సున్నితమైన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా?

గత ఏడాది జిల్లావ్యాప్తంగా నాలుగు సున్నిత ప్రాంతాలను గుర్తించి వాటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈసారి ముందస్తుగానే ఆరు సెంటర్లను గుర్తించి కెమెరాలు ఏర్పాటు చేశాము. అంతేకాకుండా ఈ సెంటర్ల వద్ద బందోబస్తు కూడా పెంచాము. కైకరం, రంగాపురం, లింగపాలెం, పిప్పర, లక్కవరం, చింతలపూడి, కోరుకొల్లు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాము.

ప్రశ్న : పరీక్ష సమయం చెబుతారా?

ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంది. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తాము.

ప్రశ్న : ఉచిత బస్సు పాస్ పరిస్థితి ఏమిటి?

ఇప్పటికే ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాము. కండక్టర్‌కు హాల్‌టిక్కెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణించొచ్చు.

ప్రశ్న : ఉత్తమ ఫలితాల సాధనకు చేపట్టిన ప్రయోగాత్మక చర్యలేమైనా ఉన్నాయా?

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాము. ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు కలెక్టర్ ద్వారా విజయభేరి కార్యక్రమాన్ని ప్రారంభించాము. దీంతోపాటు విజయకేతనం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రతిభ పెంచేందుకు చర్యలు తీసుకున్నాము. వారిలో మానసిక వికాసం కోసం డాక్టర్ మానస ద్వారా ప్రత్యేక కౌన్సెలింగ్‌లు కూడా పలుచోట్ల ఏర్పాటు చేశాము.

ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

విద్యార్థులు మానసిక ధైర్యంతో పరీక్షలు రాయాలి. ఒత్తిడికి గురికావొద్దు. ఆందోళన, కంగారు పడొద్దు. తగినంత విశ్రాంతి తీసుకుని పరీక్షలకు హాజరుకావాలి. తల్లిదండ్రులు సైతం ఇళ్లల్లో వారు చదువుకోవడానికి కావాల్సిన వసతులు కల్పించాలి. చదువు గురించి పిల్లలపై ఒత్తిడి చేయొద్దు. చదువుకోమని చెబితే సరిపోతుంది. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

భూస్వాములకు అధికారుల వత్తాసు సిగ్గుచేటు

దోసపాడు దళితులకు న్యాయం చేయండి
వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు మండలం దోసపాడు పేదలు, దళితులకు చెందిన ఆసైన్డ్ సీలింగ్ భూములు వారికి అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక అన్నేభవనంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎ.రవి మాట్లాడారు. దోసపాడు పేదలు 10 నెలలుగా గ్రామంలో ఉన్న అసైన్డ్, సీలింగ్, గయాళ భూములను పంచాలని మొక్కవోని దీక్షతో పోరాడుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఈ భూములు 25 సంవత్సరాలుగా విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్, స్థానికేతర భూస్వాములు దౌర్జన్యంగా భయభ్రాంతులకు గురిచేసి పేదల నుండి లాక్కున్నారని మండిపడ్డారు. దీనిపై జిల్లా, మండల రెవెన్యూశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దోసపాడు పేదలు కోరుతున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1965, 73 సంవత్సరాలకు ముందు అప్పటి ప్రభుత్వం భూమిలేని పేదలందరికీ భూమి పంచి డి.ఫారం పట్టాలు మంజూరు చేసిందని, కానీ 25 ఏళ్లుగా ఈ భూములను విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్, బీహార్‌కు చెందిన పప్పు సింగ్, స్థానికేతర భూస్వాములు పేదల నుండి భూములను బలవంతంగా లాక్కొని దర్జాగా అనుభవిస్తున్నారని మండిపడ్డారు.

ఈ భూ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం అండతో దోసపాడు పేదలు 10 నెలలు నుండి పోరాడుతున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి పలుమార్లు కలెక్టర్ చుట్టూ, జిల్లా, మండల రెవిన్యూశాఖ అధికారుల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించారని తెలిపారు. లోకాయుక్త 2015లో పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు భూమిని పంచలేదని ప్రశ్నించారు. కోర్టులో పెండింగ్ ఉన్నది 32 ఎకరాల భూమి అయితే నేడు రెవెన్యూశాఖ అధికారులు దానిని 72 ఎకరాలకు మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు పెట్టి పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సెక్షన్ల ప్రకారం భూముల్లోకి ఎవరూ వెళ్లకూడదనే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ భూ సమస్యలపై పేదలు భూముల్లోకి వెళ్లిన సందర్భంలో భూస్వాములు దాడిచేశారని, వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి నేటికి మూడు నెలలవుతున్నప్పటికీ ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. పరిహారం ఇచ్చి జిల్లా అధికారులు చేతులు దులుపుకున్నారని, గ్రామంలో సుమారు 350 ఎకరాల ప్రభుత్వ భూములుండగా వాటిని సర్వే చేయకుండా తహశీల్దారు పత్రికలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని మండిపడ్డారు. పేదల భూములు విషయంలో ఇలాంటి తప్పుడు రిపోర్టులిస్తున్న అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నింబ చారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల పదో తేదీ తరువాత జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సుభాషిణి

ప్రజాశక్తి - ఏలూరు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన బి.సుభాషిణి ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ 48వ రాష్ట్ర కౌన్సిల్ ముగింపు సందర్భంగా జరిగిన రాష్ట్ర నూతన కౌన్సిల్ ఎన్నికల్లో ఏలూరు జిల్లా నుండి ఇప్పటి వరకూ జిల్లా సహాధ్యక్షులుగా ఉన్న సుభాషిణి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సుభాషిణి ప్రస్తుతం పెదపాడు మండలం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూరేటి శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల అన్ని రకాల ఆర్థిక బకాయిలు, డిఎ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి ఎరియర్లు వెంటనే మంజూరు చేయాలని, సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ని రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, వివిధ పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానంగా ఈ కౌన్సిల్ ద్వారా తీర్మానాలు పంపారు.

సత్యనారాయణపై విచారణ పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు కార్పొరేషన్ డిఇఇ వంగపండు సత్యనారాయణ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈనెల మూడో తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి పిహెచ్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విచారణకు వస్తున్న సందర్భంగా ఆదివారం వారొక ప్రకటనలో ఈ డిమాండ్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని గతంలో ఎసిబి వలకు చిక్కి జైలు జీవితం అనుభవించిన సత్యనారాయణ తిరిగి ఏలూరు కార్పొరేషన్‌లో డిఇఇగా ఏ జిఒ ఆధారంగా పనిచేస్తున్నారని ప్రశ్నించారు. జైలు జీవితం గడిపిన కాలంపై వారి ఎస్ఆర్‌ను విచారణ అధికారి క్షుణ్ణంగా పరిశీలించాలని వారు కోరారు. సత్యనారాయణ తన కిందిస్థాయి ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తారని, దీనిపై కూడా విచారణ జరపాలని వారు కోరారు. ఒక్కసారి ఎసిబి కేసులో జైలు జీవితం అనుభవించిన ఏ ఉద్యోగైనా తిరిగి అదే ఊర్లో పని చేయొచ్చా అని వారు సందేహం వ్యక్తం చేశారు. విచారణ న్యాయబద్ధంగా జరగాలని వారు కోరారు.

నాటుపొగాకు రైతుల ఆశలపై 'నీళ్లు'..!

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
తడిసిపోవడంతో సగానికి పైగా తగ్గిన ధర
ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలి : రైతుల డిమాండ్

ప్రజాశక్తి - ముసునూరు

గత 15 రోజులుగా తరచూ కురుస్తున్న అకాలవర్షం నాటుపొగాకు రైతులను నట్టేట ముంచింది. వారిని కోలుకోలేని దెబ్బతీసింది. సాధారణంగా నాటుపొగాకు తడిస్తే ఆ రైతు తీవ్రనష్టం చవిచూసినట్లే. తడిసిన పొగాకు ధర సగానికి సంగం పడిపోతుంది. ముఖ్యంగా ముసునూరు మండలం అంటేనే నాటుపొగాకుకు పెట్టిందిపేరు. గత 50 ఏళ్ల నుంచి మండలంలోని ముసునూరు, గోపవరం, గోగులంపాడు, కాట్రేనిపాడు, వేల్పుచర్ల, గుళ్లపూడి తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో రైతులు నాటు పొగాకు సాగుచేస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో నాట్లు వేసి ఫిబ్రవరి, మార్చి నెలలో కోత కోస్తారు. కోత సమయంలో వర్షం పడితే సగం ధర తగ్గిపోయినట్లే. ముసునూరు మండలం మెట్టప్రదేశం కాబట్టి బోరుబోవుల ద్వారా పొగాకు పంటకు నీళ్లు పెట్టాలి. ఎకరం, అర ఎకరం రైతులందరూ కలిసి బోరు వేసుకుని పంట సాగుచేస్తారు. వంతుల విధానంలో పంటకు తడులు వేస్తుంటారు. నీరు తక్కువైనా సరిపెట్టుకునే పంట కావడంతో అధిక సంఖ్యలో రైతులు నాటుపొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది సుమారు 600 ఎకరాల్లో నాటుపొగాకు సాగుచేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. చాలాచోట్ల పొగాకు పందిళ్లు వేసి ఎండబెట్టారు. ఈ క్రమంలో 15 రోజులుగా తరచూ కురుస్తున్న వర్షానికి పొగాకు పూర్తిగా తడిసిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధర సగం పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు తడవకపోతే మార్కెట్‌లో కిలో సుమారు రూ.250 వరకూ వస్తుందని, తడిసిపోవడంతో కిలో రూ.వంద నుంచి రూ.150 వరకు మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకూ నష్టపోతున్నారు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఎకరాకు రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టామని, కనీసం రూ.70 వేల నుంచి రూ.80 వేలు కూడా వచ్చే అవకాశం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేనివిధంగా ఎకరాకు సుమారు ఆరువేల కేజీల వరకూ దిగుబడి వచ్చిందని, కానీ అకాల వర్షం తమ ఆశలపై నీళ్లు చల్లిందని పలువురు వాపోతున్నారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే దళారులు రైతులను మరింత దోచుకుంటున్నారని, పొగాకు వ్యాపారులు సిండికేట్ అయ్యి రేటు పెరగకుండా చేస్తున్నారని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అయినకాడికి పొగాకు అమ్ముకోవాల్సి వస్తుందని పలువురురైతులు చెబుతున్నారు.


తడిసిన పొగాకు పందిరి

పంట పూర్తిగా తడిసింది

మానికల వలరాజు, పొగాకు రైతు, ముసునూరు



నాకు ఉన్న ఎకరం భూమిలో 20 ఏళ్లుగా నాటు పొగాకు సాగుచేస్తున్నాను. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉంది. కానీ ఆకాల వర్షానికి పంట పూర్తిగా దెబ్బతినింది. ప్రస్తుతం పొగాకు పందిరిపై ఉంది. అదికాస్తా తడిసిముద్దయింది. సగానికి సగం ధర పడిపోతుందని భయంగా ఉంది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. ఇప్పటి వరకూ ఏ అధికారీ మావైపు కన్నెత్తి చూడలేదు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టాను. అంతేకాక వ్యాపారులందరూ సిండికేట్ అయ్యి మరింత దోచేస్తున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు

చింతా నాగరాజు, పొగాకు రైతు, ముసునూరు



నాకున్న కొద్దిపాటి భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని ఐదు ఎకరాల్లో నాటుపొగాకు సాగుచేశాను. ప్రస్తుత అకాల వర్షానికి పొగాకు పంట తడిసిపోవడంతో పెట్టుబడులు కుడా వస్తాయో, రావో తెలియడం లేదు. దుక్కికి రూ.పది వేలు, నారుకు రూ.పదివేలు, పైపాట్లుకు రూ.ఏడు వేలు, నాట్లు వేసేందుకు, పిలక తీయడానికి రూ.ఎనిమిది వేలు, క్రింసహారక మందులు, ఎరువులకు రూ.35వేలు, చివరి దశలో కోత కోయడానికి రూ.40 వేల వరకూ ఖర్చుయింది. పంట చేతికొచ్చిన సమయంలో అకాల వర్షం నష్టాల పాల్జేసింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.


గాయపడిన యాత్రికులు

వ్యాను బోల్తా : 11 మందికి గాయాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని గుబ్బలమంగమ్మ ఆలయానికి వెళ్లి వస్తున్న వ్యాను ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. కామవరం వద్ద జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో 11 మంది గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాలపురం మండలం ఖరగపురం గ్రామానికి చెందిన సుమారు 20 మంది ట్రాక్టర్‌లో గుబ్బలమంగమ్మ ఆలయానికి వెళ్లారు. అలాగే తెలంగాణ రాష్ట్రం ఖమ్మానికి చెందిన 20 మంది మినీవ్యానులో ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం సాయంత్రం తిరిగుపయనమయ్యారు. కామవరం వద్దకు రాగానే ముందువెళ్తున్న వ్యానును ట్రాక్టర్ ఓవర్ టేక్ చేసే క్రమంలో వ్యాన్‌ను ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంతర్వేదిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఖమ్మానికి చెందిన డి.నరసారావు(50), ఇ.మల్లేశ్వరి(40), డి.సాహితీ(11), జె.నరేంద్ర(40), వై.సైదమ్మ(60), పి.నాగశ్రీ(27), బి.ఉమ(37), జి.రమ(38), యు.భాస్కర్(37), వై.అలివేలు(38), ఇ.కృష్ణ(40) ఉన్నారు.

'వచ్చే ఎన్నికల్లో వైసిపి పతనం ఖాయం'

ప్రజాశక్తి - కైకలూరు

ప్రశ్నిస్తే కేసులు పెట్టే వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి మండల అధ్యక్షులు త్రినాథరాజు అన్నారు. మండలంలోని వరహపట్నంలో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం గుప్పెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయపెట్టటం తప్ప అభివృద్ధి అనేది శూన్యమన్నారు. కేవలం బటన్ నొక్కి ప్రజలకు డబ్బులు పంచడమే అభివృద్ధి కాదని, రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వరాహపట్నం గ్రామ అధ్యక్షులు పి.తాతారావు, రాష్ట్ర వడ్డీ సాధికార కమిటీ అధ్యక్షులు బలే ఏసురాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు విజయలక్ష్మి, తాడినాడ బాబు, పోలవరపు లక్ష్మీ రాణి, కైకలూరు పట్టణ అధ్యక్షులు మహ్మద్ జానీ, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు తెంటు వెంకటరమణ, సీతమ్మ, ఆగొల్లు బలేశ్వమి పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. మండలంలోని ఎనిమిది జెడిపి హైస్కూళ్ళు, ఏడు ప్రయివేటు పాఠశాలలకు సంబంధించిన 671 మంది విద్యార్థులు ముదినేపల్లి, పెదగొన్నూరు జెడిపి హైస్కూళ్లతో పాటు స్థానిక సహాయ మాత హైస్కూల్లో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. పరీక్ష నిర్వహణకు 34 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాలను ఎంఇఒ పి.మల్లీశ్వరి, మండల విద్యాశాఖాధికారి రామారావు, ఎస్ఐ షణ్ముఖసాయి పరిశీలించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతి విద్యార్థినులు మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టిడిపి నూజివీడు డివిజన్ నాయకులు పర్వతనేని గంగాధరరావు, అక్కినేని చందు అన్నారు. మండలంలోని ముసునూరు గురుకుల పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులు యార్లగడ్డ శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగమల్లేశ్వర, విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో రాష్ట్ర గౌడ చైర్మన్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు స్వామివారి చిత్రపటాన్ని చైర్మన్‌కు అందించారు. మచిలీపట్నానికి చెందిన గుండు వీరబ్రహ్మం, విమలకుమారి దంపతుల కుమారుడు ధీరజ్ నాగస్వామి స్వామివారి దేవస్థానానికి 270 గ్రాముల వెండి నాగపడగను ఆలయ సిబ్బందికి అందించారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖాధికారి రత్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది పరీక్షలకు మండలంలో మొత్తం ఎనిమిది సెంటర్లు కేటాయించగా 1789 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. గొల్లపల్లి, పల్లెర్లమూడి కేంద్రాలను సి క్యాటగిరీ కేంద్రాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. సైన్స్ సబ్జెక్టు మినహా మిగతా అన్ని సబ్జెక్టులు ఒక్కొక్క పేపర్ మాత్రమే ఉంటాయన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళన కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యాశాఖ అధికారి కోరారు.

అనారోగ్య మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కేన్సర్‌తో బాధపడుతున్న మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని చినపాలపర్రుకు చెందిన పాస్టర్ కె.రత్నరాజు భార్య అన్నామణి కేన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి, యువనేత కొడాలి వినోద్ గ్రామ అధ్యక్షుడు ఈసేల గాలిబాబు చేతులమీదుగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ అన్ని జబ్బులకు వర్తించదంటూనే పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జి.నారాయణరావు, పంతగాని సురేష్, ఈడే కృష్ణ, కొంటి ప్రశాంత్, పరసా రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం'

చింతలపూడి: వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని టిడిపి నాయకులు సర్ణగౌడ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ 16వ వార్డులో పొనుకుమాడు ఎస్సి పేటలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టిడిపి నేతలు సైకిల్ పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురంలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మండలంలోని మల్కాపురం గ్రామంలో వందేళ్ల చరిత్ర కలిగిన సీతారాముల ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అశేష ప్రజలకు మహా అన్న సమారాధన నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీకృష్ణ యాదవ సంఘం, మల్కాపురం గ్రామ పెద్దల సమక్షంలో సీతా రాముల కళ్యాణం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దేవాలయం వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పత్సాల సునీత, వెంకటేశ్వరావు, గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేవూరుపాలెంలో...

ముదినేపల్లి : మండలంలోని చేవూరుపాలెం రామాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో పరిసర గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

సిపిఎం కార్యాలయంలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

ఫర్నీచర్ ధ్వంసం

జీలుగుమిల్లి: అధిక డబ్బులు ఇవ్వలేదని మతిస్థిమితం లేని వ్యక్తి స్థానిక సిపిఎం కార్యాలయ ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన ఘటన జీలుగుమిల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లి గ్రామానికి చెందిన ఆ అంజయ్య కుమారుడు మతిస్థిమితం కోల్పోయి సెంటర్‌లో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం, ప్రజా సంఘాల కార్యాలయానికి వచ్చి అక్కడ ఉన్నవారిని డబ్బులు అడిగాడు. లేవు అని చెప్పడంతో కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు సిపిఎం నాయకులు తెల్లం దుర్గారావు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

అదృశ్యమైన వృద్ధుడు మృతి

టి.నరసాపురం: మండలంలోని తెడ్లం గ్రామంలో అదృశ్యమైన వృద్ధుడు పాతూరి వీరరాఘవయ్య(85) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తెడ్లంకు చెందిన వీరరాఘవయ్య కొన్నిరోజులుగా మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో గతనెల 31న పొలం నుండి ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలుదేరాడు. అయితే అక్కడ నుంచి ఇంటికి వెళ్లలేదు. సాయంత్రం బంధువులు ఇంటికి వచ్చి చూస్తే వీరరాఘవయ్య కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆతని కుమారుడు ధర్మారావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ఉన్న పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

టి.నరసాపురం: మండలంలోని శింగరాయపాలెంలో పేకాట శిబిరంపై ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.50,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


కోడిపందేల స్థావరంపై దాడి

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం పంచాయతీ బీమలవారిగూడెం శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ వి.చంద్రశేఖర్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎఎంసి చైర్మన్ పోస్టు భర్తీ అయ్యేనా..!

జిల్లాలో మొత్తం 20 ఎఎంసిల చైర్మన్ల ఎంపిక పూర్తి

నూజివీడు ఒక్కటే పెండింగ్


నూజివీడు మార్కెట్ యార్డ్ కార్యాలయం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ఎఎంసి (మార్కెట్ యార్డ్) చైర్మన్ ఎంపిక ఎప్పుడా అని నియోజకవర్గ ప్రజలు దాదాపు నాలుగేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. నూజివీడు ఎఎంసి చైర్మన్ ఎస్‌సికి రిజర్వ్ అయినట్లు 2019లోనే ప్రకటించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 21 ఎఎంసిలు ఉండగా నూజివీడు తప్పా మిగతా 20 ఎఎంసిలకు ఛైర్మన్ పదవులకు ఎంపిక పూర్తయినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారులు స్పష్టం చేశారు. వైసిపిలో పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్‌సిలు కీలక భూమిక పోషిస్తున్నారు. అలాంటిది ఎస్‌సిలకు రిజర్వ్ అయిన ఛైర్మన్ పదవిని భర్తీ చేయకుండా అధికార పార్టీ ప్రతినిధులు నాలుగేళ్ల నుంచి తాత్సారం చేయడం పట్ల ఎస్‌సి వర్గాల నాయకుల్లో, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఛైర్మన్ పదవి భర్తీ కాకపోవడంతో ఇక్కడి ఎఎంసికి డిప్యూటీ డైరెక్టర్ పర్సన్ ఇన్‌ఛార్జిగా ఛైర్మన్ హోదాలో బాధ్యతలను చేపడుతున్నారు. ఛైర్మన్ అభ్యర్థి ఎంపిక పూర్తయితే మరో 18 మంది సభ్యులు డైరెక్టర్లుగా నామినేట్ అవుతారు. స్థానిక అధికార పార్టీ ఎంఎల్ఎ ఈ ఎఎంసికి గౌరవ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. నూజివీడు ఎఎంసి ఏర్పాటైనా తర్వాత ఛైర్మన్ పదవి మొదటిసారిగా ఎస్‌సికి రిజర్వ్ అవ్వడంతో ఎస్‌సి నాయకులు, ఆ వర్గ ప్రజలు అప్పట్లో ఎంతో సంతోషించారు. కాని ఆనందం ఛైర్మన్ ఎంపికలో జరుగుతున్న తీవ్ర జాప్యంతో ఆవిరైందని పలువురు ఎస్‌సి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛైర్మన్ ఎన్నిక అనేది ఉంటుందా లేదా అనే అనుమానాలు నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఎఎంసి ఛైర్మన్ పదవి ఎంపిక విషయంలో జరుగుతున్న విపరీతమైన జాప్యంతో లోపల తీవ్ర అసంతృప్తి ఉన్నా, బయటపడి ఎస్‌సి నాయకులు ఎవరూ కూడా తమ ఆవేదనను వ్యక్తపరచలేని నిస్సయక పరిస్థితి. పదవులు భర్తీ చేసే క్రమంలో పదవి కోసం ఆశపడేవారు అనేక మంది ఉంటారని, పోటీ ఉందని అసలుకే ఎసరు అన్నట్లు ఛైర్మన్ పదవిని భర్తీ చేయకపోవడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమర్థులైన వ్యక్తిని ఛైర్మెన్ పదవికి ఎంపిక చేస్తే మిగతా ఆశావాహులుకూడా కొన్నీ రోజులు అసంతప్తిగా ఉన్నా ఆ తర్వాత సద్దుమణిగి, సర్దుకుపోతారని. అంతే గాని పోటీ ఉందని అసలు ఛైర్మెన్ పదవిని భర్తీ చెయ్యకుండా తీవ్ర జాప్యం చెయ్యడం భావ్యం కాదనే అభిప్రాయం నియోజకవర్గ ఎస్సి ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఎఎంసి ఛైర్మన్ పదవిని భర్తీ చేసే క్రమంలో ఏళ్ల తరబడి జరుగుతున్న విపరీత జాప్యంలో నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి తీవ్రమై వ్యతిరేక జ్వాలలు బలపడకముందే ప్రభుత్వం, జిల్లా మంత్రులు చొరవ తీసుకొని నూజివీడు ఎఎంసి పదవిని భర్తీ చేయడానికి చర్యలు చేపట్టాలని వైసిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో కోరుతున్నారు. నూజివీడు నియోజకవర్గం ఏలూరు జిల్లాలోకి వెళ్లడంతో రిజర్వేషన్ కూడా ఇటీవల మారినట్లు నూజివీడు మార్కెట్ కమిటీ అధికారులు తెలుపుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉండగా మార్కెట్ ఛైర్మన్ పదవి ఎస్‌సి రిజర్వేషన్(జనరల్)గా ఉండగా ఏలూరు జిల్లాలో కలిసిన అనంతరం ఒసి (మహిళ)గా రిజర్వేషన్ మారినట్లు పేర్కొంటున్నారు. ఎస్‌సి అయ్యి మూడేళ్లయ్యింది. ఒసి(మహిళా) రిజర్వేషన్ అయ్యి ఏడాది దాటుతున్నప్పటికీ ఛైర్మన్ భర్తీ అనేది జరగని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి : ఎఎంసిల జిల్లా డిడి

ఎఎంసి ఛైర్మన్ పదవి అనేది నామినేట్ పదవని, ప్రభుత్వమే దానిపై నిర్ణయం తీసుకోవాలని, తమకు ఎటువంటి అధికారం ఉండదని జిల్లా మార్కెటింగ్ శాఖ డిడి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన వారిని ఛైర్మన్, సభ్యులుగా ఎవరిని నియమిస్తే వారితో పదవి బాధ్యతలను చేపట్టే విధంగా చూడటమే తమ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కమిటీ జాబితా వస్తే వారితో ప్రమాణం చేయించడం వరకే తమ పని అని, సభ్యులను నియమించే అధికారం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు.



ఉగాది పురస్కారం అందుకుంటున్న బాబూరావు

బాబూరావుకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు వెటర్నరీ ఆసుపత్రి లైవ్ స్టాకు అధికారి డాక్టర్ మల్లిపూడి చిన బాబూరావుకు విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ విశ్వగురు ఉగాది పురస్కారాన్ని ఆదివారం అందించారు. హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పలు రంగాల్లో సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి ఉగాది పురస్కారాలు ఇవ్వడం ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తోందని సంస్థ అధినేత సత్యవోలు రాంబాబు వెల్లడించారు. తెలంగాణా ప్రభుత్వ సలహాదారుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి కెవి.రమణ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.

పలుచోట్ల మట్టల ఆదివారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలు పట్టుకొని ప్రార్థన మందిరాలకు వెళ్లారు. ఆనంతరం గ్రామ పధాన కూడలిల్లో ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లిలోని అన్నీ ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి : మండలంలోని అంతోనీ నగర్ ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బేతాని కాన్వెంట్ నుంచి ఆర్‌సిఎం చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బొడ్డు జ్ఞాన ప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీక న్ బ్రదర్ మత్తయి, బేతాని కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ తెరిసా, విశ్వాసులు పాల్గొన్నారు.

ముసునూరు : మట్టల ఆదివారం పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. రక్షణ సైన్యం చర్చి పాస్టర్ కెప్టెన్ ఎం.రాజువనిత ఆధ్వర్యంలో మట్టలతో ప్రత్యేక అలంకరణలతో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సిఎం, సిఎస్ఐ, బెరాక, పలు పాస్టర్లు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల, కొత్త పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, ఎల్లండిపేట గ్రామాల్లో ఆదివారం మట్టల ఆది వారం ఘనంగా నిర్వహించారు. కొత్త పట్టిసీమలో సెయింట్ పాల్స్ లూదరన్ చర్చిలో సండే స్కూల్ పిల్లలు గ్రామ వీధుల్లో మట్టలతో ర్యాలీ నిర్వహిఒచారు. అనంతరం చర్చి సంఘ కాపరి ఎడి ఆశీర్వాదం, డి.ఇమ్మానుయేలు, సంఘ సభ్యులు చర్చి ఆవరణలో ప్రార్థనలు నిర్వహించారు.

టి.నరసాపురం : టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం, బంధంచర్ల గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మట్టలతో, పూలతో వీధుల్లో ప్రదర్శనలు చేశారు.

బుట్టాయగూడెం : సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ పాస్టర్ ఆమెన్, మణికాంత్, విమలకుమారి, ప్రసంగరాజు, తలారి రాజు, సంఘ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

నూజివీడు: నూజివీడు పట్టణంలోని ఎల్ఎఎఫ్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి అలంకరించిన ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలి సురేష్, విఆర్ఒ రాజు, డి.రాంబాబు, ఏసేబు, దొరబాబు, పురుషోత్తం, రవిబాబు, కాలేసు, మురిదొడ్డి జయరాజు, వెంకన్న బాబు పాల్గొన్నారు.

మండవల్లి : మండలంలో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండవల్లిలో పాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మట్టలను పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్‌సిఎం సంఘం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు మట్టలతో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలో విచారణ గురువులైన రెవ ఫాదర్ కళ్యాణ్ కుమార్ , ఏసుబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

ఆగిరిపల్లి : మండలంలో క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న పిల్లలు, యువకులు ఉదయం నుంచి ఈత మట్టలను రంగురంగుల పూలతో అలంకరించి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆగిరిపల్లిలో రెవ.కె.దైవనిరీక్షణకుమార్, కనసానపల్లిలో పాస్టర్ కె.ఐజక్‌జాన్, అడవినెక్కలంలో రెవ సిహెచ్.శశిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


మహనీయుల జయంతులు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం ఈ నెల ఐదో తేదీన, సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి 11న, అణగారిన తరగతుల ఆశాజ్యోతి భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి 14న ఏలూరు ఆర్ఆర్‌పేటలోని బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్ అధ్యక్షతన బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా సమావేశం నిర్వహించారు. తొలుత ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ఏలూరు పట్టణ అధ్యక్షులు కెల్లా వెంకటరమణ మృతికి సమావేశం సంతాపం తెలిపారు. అనంతరం పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ మహనీయుల జయంతి కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు వృత్తి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నగర నాయకులు కెల్లా దుర్గాప్రసాద్, కాటకోటి సూర్యప్రకాశరావు, నాయి బ్రాహ్మణ సేవ సంఘం నగర నాయకులు ఉద్దవల్లి కిశోర్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


మొక్కలు నాటుతున్న డిపిఒ మల్లికార్జునరావు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించుకోచ్చని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు అన్నారు. ఆగిరిపల్లి మండల పరిధిలోని బొద్దనపల్లి గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల పట్ల సంతృప్తిని వ్యక్త పరిచారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించి ఇంటి పన్నులు, నీటి కుళాయి పన్నుల వసూలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మొక్కలునాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసు, కె.సంగమయ్య, సిహెచ్.పుల్లారావు, బి.అంజలి, కె.నవీన్‌బాబు, మీర్జావలీ, సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని విరమించుకోవాలి

ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు - 17 నుంచి ఆందోళనలు ఉధృతం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ, ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణపై కొత్త సింగన్నపల్లి కమ్యూనిటీ హాలులో ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ, ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. ఆదివాసి ఐక్య కార్యచరణ కమిటీ జిల్లా ఛైర్మన్‌గా మొడియం శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ అప్పగించిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. తనపై పెట్టిన నమ్మకానికి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఆమోదించిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఈనెల 17న మండల కార్యాలయం వద్ద నిరసన, అనంతరం ప్రదర్శన, 24న ఆర్‌డిఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీలకు ఎలాంటి నష్టమూ జరగదని ఎంఎల్ఎ బాలరాజు చెప్పడం అమాయకులైన ఆదివాసీలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. 1976లో ఎస్‌టి జాబితాలో కలిపిన కులాల వల్ల ఇప్పటికే ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పోలవరం రిజర్వుడు నియోజకవర్గంలో రసపుత్ర నాగభూషణం ఎంఎల్ఎగా గెలవడం దగ్గర నుండి ఇప్పటివరకూ ఏజెన్సీలోని వివిధ మండలాల్లో కొత్తగా ఎస్‌టి జాబితాలో చేరిన వారు పదవులు అనుభవించడం నష్టం కాదా అని ప్రశ్నించారు. ఎంపీలుగా, ఎంఎల్ఎలుగా, రాజకీయ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దోచుకోవడం నిజం కాదా అని అన్నారు. ఈ సమావేశంలో ఎటిఎ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు, గౌరవాధ్యక్షులు తెల్లం రాములు, ఉపాధ్యక్షులు సోదెం రాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, జిల్లా అధ్యక్షులు కొమరం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు, టిడిపి జిల్లా కార్యదర్శి చాందిని, జనసేన మండల అధ్యక్షులు తెల్లం రవిప్రసాద్, పైదా పోతురాజు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం భాస్కర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు సరియం రామ్మోహన్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కారం రాఘవ, ప్రగతిశీల యోజన సంఘం నాయకులు తగరం బాబూరావు, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, ఆదివాసీ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్ల శ్రీను, ఆదివాసీ కొండరెడ్ల సంఘం జిల్లా నాయకులు ముత్యాలరెడ్డి, ఆదివాసీ మహాసభ జిల్లా అధ్యక్షులు కారం వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాంబాబు, ఆదివాసీ జెఎసి వైస్ ఛైర్మన్‌గా తిరిగి ఎన్నికైన కురసం దుర్గారావు పాల్గొన్నారు.

కుటుంబంపై దాడి

భర్త మృతి - భార్య, కుమారుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


శివ కుటుంబం (ఫైల్ ఫోటో)

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై ఓ వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో కలకలం సృష్టించింది. ఆదివారం వేకువజామున రక్తపు గాయాలతో ఉన్న భార్య, భర్త, కొడుకుని స్థానికులు, బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో భర్త మృతిచెందాడు. భార్య, కుమారుడు చికిత్స పొందుతున్నారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మైసన్నగూడేనికి చెందిన తోణం శివ, భార్య చిన్ని ఇద్దరూ గ్రామంలో వర్జీనియా పొగాకు క్యూరింగ్‌లో పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కొడుకు మంగరాజు(11) చదువుకుంటున్నాడు. రోజూమాదిరిగా అదే ఊరిలో ఉన్న బ్యారన్ వద్దకు శివ క్యూరింగ్ పనులు చేసేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి శివ తలపై ఆయుధంతో బలంగా కొట్టాడు. అలాగే శివ ఇంటి వద్దకు వెళ్లి ఇంటిలో నిద్రిస్తున్న భార్యపై, కుమారుడిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఆదివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో పక్కనే మరో బ్యారన్ డ్రైవర్ వచ్చి చూడగా రక్తపు మడుగుల్లో పడి ఉన్న శివను చూసి కంగారుపడి, ఈ విషయాన్ని భార్యకు చెబుతామని ఇంటికి వెళ్లి చూడగా ఇంటిలో శివ భార్య, కుమారుడు కూడా రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి బంధువులకు సమాచారం అందించాడు. వెంటనే వారు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శివ, చిన్ని పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ఆస్పత్రికి తరలించారు. గుంటూరులో పరిస్థితి విషమించి శివ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సిఐ బాలాసురేష్, ఎస్ఐ సాగర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములను రప్పించి వివరాలను సేకరించారు. పోలీస్ జాగిలం ఇంటి పరిసరాల్లో, ఇంటికి సమీపంలోని పామాయిల్ తోటలో తిరుగాడింది. దాడికి ఉపయోగించిన రాడ్డు చెరువులో లభ్యమైనట్లు సమాచారం. ఈ ఘటనలో వేగవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కుటుంబ తగదాలు, ఆర్థిక లావాదేవీలు, స్నేహితుల మధ్య గొడవల కారణంగా ఈ దాడికి పాల్పడి ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సిఐ బాల సురేష్ తెలిపారు.


కొడుకు మంగరాజు


భార్య చిన్ని

చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈనెల ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఆదివారం గోడలకు పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఐదు లక్షల మందితో భారీ ర్యాలీ చేపడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 13 డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు వేతనం అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి 200 రోజు పని దినాలు కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని, పౌర సరఫరాల ద్వారా 14 రకాల సరుకులు అందజేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మండలం నుంచి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు చలో ఢిల్లీ కార్యక్రమానికి ఈనెల మూడో తేదీన బయలుదేరుతున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల ఐదో తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి పట్టణ పౌర సమాఖ్య పట్టణ కార్యదర్శి వంగా గోపి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ చలో ఢిల్లీని విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో వార్డు అంబేద్కర్ యూత్ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.